ప్రజలకు అండగా 'సాక్షి'

వైరా మున్సిపల్ కమిషనర్‌తో నేడు ఫోన్ ఇన్



వేణు, కమిషనర్

వైరా: ఖాళీ స్థలాలు, రహదారుల వెంట నిలుస్తున్న నీటితో దోమల బెడదకు తోడు పలుచోట్ల రహదారులు, డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈనేపథ్యాన వైరా మున్సిపాలిటీ పరిధి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ సీహెచ్.వేణు దృష్టికి నేరుగా తీసుకెళ్లేలా 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. స్థానికులు తమ సమస్యలను కమిషనర్‌కు వివరించడం ద్వారా పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుంది. తాగునీటి సరఫరాలో లోపాలు, పారిశుద్ధ్య సమస్యతో ఇతర అంశాలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు.

సాక్షి ఫోన్ ఇన్

తేదీ : 12 - 07 - 2025, శనివారం
సమయం : ఉదయం 9-30నుంచి 10-30గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
73965 07165



బోనకల్ బ్రాంచ్ కెనాల్ గేట్లు, బ్రిడ్జి శిథిలావస్థకు చేరిన దృశ్యం



ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో పోలంపల్లి మేజర్ కాలువ

సాగర్ కాల్వలు.. అధ్వానం

- అడవిని తలపిస్తున్న కాలువలు
- అల్లుకుపోయిన చెట్లు, ముళ్లపొదలు
- శిథిలావస్థకు చేరిన డ్రాపులు, బ్రిడ్జిలు
- చివరి భూములకు చేరని నీరు
- ఆందోళనలో అన్నదాతలు

బోనకల్: మండలంలోని బోనకల్ బ్రాంచ్ కెనాల్ ప్రధాన కాలువతో పాటు మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్లు అధ్వానంగా తయారయ్యాయి. 21వ కిలో మీటర్ల నుంచి 33.7 కిలో మీటర్లు వరకు బోనకల్ బ్రాంచ్ కెనాల్ ఉంది. ఈ కెనాల్ పరిధిలోని డ్రాపులు, బ్రిడ్జిలు శిధిలావస్థకు చేరుకోని ప్రమాదపు అంచున నిలిచాయి. కాలువకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగి నడిచేందుకు వీలు లేకుండా పోయింది.

మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్లు కాలువలు..

బీబీసీ పరిధిలోని వల్లాపురం, కలకోట, పోలంపల్లి, లింగాల మేజర్లు ఉండగా నాగులవంచ 1, 2, రామాపురం, రావినూతల, ముష్టికుంట్ల 1,2, నారాయణపురం, బోనకల్, వత్సవాయి, ఆళ్లపాడు, మోటమర్రి, కాకరవాయి లలో మైనర్లు ఉండగా వీటి పరిధిలో సుమారు 30కి పైగా సబ్ మైనర్ కాలువలు ఉన్నాయి. ఈ కాలువలలో పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు, చెట్లు పెరగడంతో పాటు స్కిల్ట్ తీయకపోవడంతో.. కాలువలు పూడి మైనర్ కాలువల పరిధిలోని సబ్ మైనర్‌లకు నీళ్ల వెళ్లే పరిస్థితి లేదు. దీంతో చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.



జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న లస్కర్లు

నీటి సామర్థ్య వివరాలిలా..

బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు 1,380క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యం ఉన్నప్పటికీ కనీసం 600నుంచి 700క్యూసెక్కుల నీరు కూడా విడుదల చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఒకవేళ 1,000క్యూసెక్కుల నీరు వదిలినా.. కాలువల్లో నీరు ముందుకు సాగక పోవడంతో గండ్లు పడుతున్నాయి. దీంతో అధికారులు తక్కువ క్యూసెక్కుల నీటిని వదిలి చేతులు దులుపుకుంటున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటికీ చేయని మరమ్మతులు..

గత 20సంవత్సరాల క్రితం కాలువలకు మరమ్మతులు చేపట్టరు. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టక పోవడంతో కాలువలన్నీ పిచ్చి మొక్కలు, సర్కారు కంప, చెట్లతో అల్లుకుని అడవిని తలపిస్తుంది. ఇదిలా ఉండగా బ్రిడ్జిలు, డ్రాప్‌లు పూర్తిగా శిధిలావస్థకు చేరుకోని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. బోనకల్ బ్రాంచ్ కెనాల్‌పైన ఉన్న డ్రాఫ్‌లు కూలిపోయి మైనర్లకు, సబ్ మైనర్లకు నీరు వెళ్లకపోవడంతో రైతులు తాటి మొద్దులను కాలువలలో వేసి నీళ్ల ఎక్కించుకునే పరిస్థితి దాపురించింది. దీనికి తోడు బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలో 25మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా కేవలం 9మంది మాత్రమే ఉన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని అన్నికాలువలకు మరమ్మతులు చేయించి ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటలకు సక్రమంగా నీటిని అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి..



ముష్టికుంట్ల మైనర్ కాలువలో సర్కారుకంప, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి సాగర్ నీళ్లు ముందుగు వెళ్లే పరిస్థితి లేదు. తూములకు కూడా నీరు ఎక్కడం లేదు. డ్రాపులు పగిలిపోయి ఉన్నాయి. పంటలకు నీరు పెట్టుకోవాలంటే తీవ్రంగా శమించాల్సి వస్తుంది తక్షణమే జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలి.

– పండగ వీరబాబు, రైతు, ముష్టికుంట్ల

మరమ్మతులు చేయించాలి..



బీబీసీ పరిధిలోని ముష్టికుంట్ల ప్రధాన గేట్‌ల బ్రిడ్జి పూర్తిగా శిధిలావస్థకు చేరుకుంది. గేటు తలుపులు పగిలిపోయాయి. సువ్వలు బయటపడి బ్రిడ్జి కూలేందుకు సిద్దంగా ఉంది. తాత్కాలిక మరమ్మతు పనులు చేపించమని అడిగినా అధికారులు నిధులు లేవని చెబుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేయించాలి.

– మల్లేశ్వరరావు, రైతు, ముష్టికుంట్ల

ప్రతిపాదనలు పంపించాం..



బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని మేజర్లు, మైనర్లు, సబ్‌మైనర్ల పరిధిలో కాలువలకు జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు ఎస్టిమేట్‌లు వేసి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం లస్కర్‌లతో ప్రతిరోజు కొంతమేర జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహిస్తున్నాం.

– తమ్మారపు వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈ

ఆరోగ్య పట్టణంగా తీర్చిదిద్దుతాం..



వైద్య పరీక్షలు చేస్తున్న మట్టా దయానంద్

సత్తుపల్లిటౌన్: పట్టణాన్ని పరిశుభ్రంగా నిలుపుతున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని.. అందరు సహకారంతో ఆరోగ్య పట్టణంగా తీర్చిదిద్దుదామని ఆషా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లి మున్సిపాలిటీలో వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా.. వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కోంద్రు నర్సింహా, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాం, గంగారం పీహెచ్‌సీ వైద్యులు ఆర్.అవినాష్, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, తోట సుజలరాణి, చల్లగుళ్ల నర్సింహారావు, ఎండి కమల్ పాషా, గాదె చెన్నారావు, మేనేజర్ మైసా శ్రీనివాసరావు, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనంతసాగర్ గ్రామంలో..

చింతకాని: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్ పేర్కొన్నారు. మండలంలోని అనంతసాగర్ గ్రామంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలో.. రోగులను పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, రేఛల్‌రాణి, ఏఎన్‌ఎం సంధ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి కాశిబోయిన నాగేశ్వరరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లంకాసాగర్ ఆయకట్టుకు నీరు విడుదల



లంకాసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి: మండలంలోని లంకాసాగర్ చిన్న నీటి జలాశయం నుంచి పంట పొలాలకు అందించే నీటిని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దయానంద్ చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు, నాయకులు, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

మధిర: అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడు/పౌరురాలు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు కోరారు. మధిర నియోజకవర్గ స్థాయిలో 5మండలాల బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్‌వో) శిక్షణలో భాగంగా చివరి రోజు శుక్రవారం మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాం అండ్ కెపాసిటీ బిల్డింగ్‌పై శిక్షణ జరిగింది. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్ కరుణాకర్ మాట్లాడుతూ.. ప్రతి బీఎల్‌వో ఫారం 6, 6ఏ, 7, 8 ల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని, క్షేత్ర పరిశీలన చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు విశ్వనాథం, జమీర్, రఫీ పాల్గొని బీఎల్‌వోల బాధ్యతలు, విధులు, సాధారణ సూచనలు తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. బీఎల్‌వోలు అందరికీ ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించారు.

మీర్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి

వైరా: వైరాలోని బోడేపూడి భవనంలో శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా రిజర్వాయర్ రూపశిల్పి మీర్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ 148వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవాజ్ సంగ్ బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శనగా వెళ్లి ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బొంతు రాంబాబు, రామారావు, సాంబశివరావు, నర్సయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, పురుషోత్తం పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించుకోవాలి



మత్కేపల్లిలో అవగాహన కల్పిస్తున్న మధిర ఏడీఏ విజయ్ చంద్ర

చింతకాని: పంటల సాగులో ద్రవరూపంలో ఉండే నానో యూరియాను వినియోగించుకోవాలని మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్ చంద్ర రైతులకు సూచించారు. మండలంలోని నాగులవంచ, మత్కేపల్లి గ్రామాల్లో నానో యూరియాపై శుక్రవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించగా.. ఎరువుల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. మండల వ్యవసాయాధికారి మానస, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..

సత్తుపల్లిరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సాగతిస్తున్నామని బీసీ సంక్షేమం సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన బీసీ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, సుజలారాణి, కమల్‌పాషా, రాంబాబు, నాగుల్‌మీరా, అప్పారావు, కృష్ణ, నాగభూషణం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పగిడేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి



తీగలబంజర పగిడేరు బ్రిడ్జిపై నిరసన తెలుపుతున్న స్థానికులు

కొణిజర్ల: మండలంలోని లాలాపురం, తీగలబంజర మధ్య ఉన్న పగిడేరుపై హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అయా గ్రామాల ప్రజలు పగిడేరు బ్రిడ్జిపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. వేలాది మంది ఖమ్మం కొత్తగూడెం జిల్లాకు ప్రయాణిస్తుంటారని, వర్షం వచ్చినప్పుడల్లా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీంతో దాదాపు 15 గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచంలోకి రాలేక పోతున్నారని అన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తక్షణమే పగిడేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలన్నారు. కార్యక్రమంలో నరసయ్య, కృష్ణార్జునరావు, రామారావు, భరత్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



ఆలయ ధర్మకర్త మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

వైరారూరల్: నూతనంగా ఎన్నికైన ధర్మకర్త మండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సూచించారు. మండలంలోని స్నానాల లక్ష్మీపురంలోని గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొడ్డా పుల్లయ్య సతీమణి దొడ్డా ఉషారాణిని నియమించగా దర్మకర్త మండలి సభ్యులుగా మల్లు శేషమ్మ, సుల్తాన్ పద్మా, మొగునూరి సత్యనారాయణ, తలారి నర్సింహరావు, గిరగాని శ్రీనివాసరావు, సంగెపు రామకృష్ణ నియమించగా ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఆలయ అర్చకులు కంచల చంద్రశేఖర్ శర్మను నియమించారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమక్షంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఈ. వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత ముసలిమడుగు గ్రామానికి చెందిన 40మంది లబ్ధిదారులకు ఇందిర ఇళ్ల మంజూరు పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మండల, పట్టణ అధ్యక్షులు వెంకటనర్సిరెడ్డి, సీతారాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



శంకుస్థాపన చేస్తున్న రాయల నాగేశ్వరరావు

ముదిగొండ: ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేరుస్తుందని రాష్ట్ర గిడ్డంగులసంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మేడేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి, లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముదిగొండ, మేడేపల్లి సొసైటీ చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, సామినేని వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నాగేశ్వరరావు, దేవేంద్రం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, బాధితులు

మధిర: ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మధిర తహసీల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు మాట్లాడుతూ.. అనర్హులను అర్హులుగా చేస్తున్న ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని కోరారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు అధికారులు అర్హులను అనర్హులుగా, అనర్హులను అర్హులుగా తారుమారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత అన్యాయం జరుగుతున్నప్పటికీ మండలంలో పేదల పక్షాన కమ్యూనిస్టులు తప్ప మాట్లాడేవారు లేరని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పాపినేని రామనరసయ్య, పట్టణ కార్యదర్శి పడకంటి మురళి, శంకర్ రావు, ధనలక్ష్మి, వెంకటనరసయ్య, అమరయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

ఇల్లు రాలేదని నిరసన

మధిర: నిరుపేద కావడంతో పాటు ఒంటరి మహిళగా ఉన్న తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని ఆరోపిస్తూ దెందుకూరు గ్రామానికి చెందిన ఎలిజాల శిరోమణి శుక్రవారం మధిర తహసీల్ వద్ద బైఠాయించి నిరసన తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ఇళ్లులు ఉండి, భూమి ఉన్న వారికి ఇళ్లు కేటాయించి, మాలాంటి వారిని పట్టించుకోవడం లేదన్నారు.నిలువ నీడలేని తమ కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది.

రైతులను ఆదుకోవాలి

కల్లూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలు వర్షాలు లేక ఎండిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో, పసుమర్తి చందర్‌రావు నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు జోక్యం చేసుకుని సీతారామ్ ప్రాజెక్ట్‌గాని, సాగర్ జలాలు కాని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, డివిజన్ కమిటీ సభ్యులు కృష్ణార్జునరావులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా నీటిని విడుదల చేయాలి

తల్లాడ: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా నీటిని విడుదల చేయాలి సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల చొరవ తీసుకొని మండలానికి సాగునీటిని విడుదల చేయాలన్నారు. సమావేశంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కృష్ణారావు, యువజన కాంగ్రెస్ నాయకుడు కిరణ్‌కుమార్, ప్రసాద్, అంజయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టు కింద రైతులు పంటలు సాగు చేసుకునేందుకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రీన్‌ఫీల్డు హైవే రహదారి నిర్మాణంలో ధ్వంసం అయిన పంట కాల్వలను తక్షణమే బాగు చేయించాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు, నాయకులు చలపతిరావు, పురుషోత్తం, నరసయ్య, మధు, రవి తదితరులున్నారు.

క్లుప్తంగా

టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..



మాట్లాడుతున్న పీఓ వెంకట్

బోనకల్: టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా టీబీ ప్రోగ్రాం మేనేజర్ వెంకట్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో టీబీ(క్షయ)వ్యాధిపై ఏఎన్‌ఎం, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆర్‌బీఎస్‌కే టీమ్‌లకు శిక్షణ ఇచ్చి మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో వ్యాధిని గుర్తించినట్లయితే పూర్తిస్థాయిలో తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ గంటయ్య, సందీప్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శిరీష, డాక్టర్ స్రవంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సుజాత, హెల్త్ సూపర్‌వైజర్లు, దానయ్య, శోభ పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన

ముదిగొండ: ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యక్షతన డ్రగ్స్‌పై యువతకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సదర్భంగా ఎస్‌ఐ హరిత మాట్లాడుతూ.. గంజాయి విక్రయించినా, దానిని వాడినా యావజ్జీవ శిక్ష ఖాయమన్నారు. సదస్సులో స్టూడెంట్ కౌన్సిలర్ ఆమోస్, ఏజీఎంఓ గురవయ్య, ఎస్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి

సత్తుపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల అన్నారు. శుక్రవారం సత్తుపల్లి నీలాద్రి అర్బన్ పార్కులో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రేంజర్ పి.స్నేహలత, ఎఫ్‌ఎస్‌ఓ నర్సింహా, లయన్స్‌క్లబ్ బాధ్యులు సింగరేణి రవి, జగన్మోహన్‌రావు, సోమిరెడ్డి, సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, సాంబశివరావు, సత్యనారాయణ, అటవీశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలకార్మికులు గుర్తింపు

చింతకాని: మండలంలోని నాగులవంచ, తిమ్మినేనిపాలెం గ్రామాల్లో ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు ఇద్దరు బాలకార్మికులను గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులవంచ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న బాలకార్మికుడిని, తిమ్మినేనిపాలెంలో ఇసుక ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్న బాలకార్మికుడిని ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు గుర్తించగా.. మధిర అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కొర్నె చందర్‌రావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

డీజిల్ చోరీ

చింతకాని: మండలంలోని నేరడ సమీపాన నాగపూర్-అమరావతి హైవే కార్యాలయం వద్ద ట్రాక్టర్‌లో 15లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఘటనపై సూపర్‌వైజర్ కోట రవి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి

మధిర: మాటూరుపేట గ్రామానికి చెందిన మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ (1986–1990)అన్నెం మోహన్ రావు (66) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు మోహన్ రావు మృతితో మాటూరుపేట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కారేపల్లి: కారేపల్లి క్రాస్ రోడ్డు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కారేపల్లి టౌన్, విశ్వనాథపల్లి, కారేపల్లి రూరల్, గాంధీనగర్ ఫీడర్ గ్రామాల్లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం కలుగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల 33–11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతులు నిర్వహిస్తున్నందున 11కేవీ తనికెళ్ల, ముక్రిహిల్స్ వాటర్ గ్రిడ్, తుమ్మలపల్లి, నర్సింగ్ తండా ఫీడర్లకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రాయల సురేష్ తెలిపారు.

చింతకాని: చింతకాని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టనున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ చావా శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముదిగొండ: మండలంలోని ముదిగొండ, మాదాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ముదిగొండ విద్యుత్‌శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యేక ఆహారం

ముదిగొండ: మండలపరిధిలోని బాణాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 122మంది విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక ఆహారం అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి పుట్టిన రోజు ఈ నెల12న కావటంతో రూ.5వేలు వెచ్చించి పాఠశాలలోని విద్యార్థులకు చికెన్‌తో ఆహారం అందించారు.

ప్రపంచ జానాభా దినోత్సవం

మధిర/ముదిగొండ/ఎర్రుపాలెం/ఏన్కూరు: అత్యధిక జనాభా వలన మానవ మనుగడకు రాబోయే రోజుల్లో కష్టం అవుతుందని, కుటుంబ నియంత్రణ పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు పృథ్వీరాజ్ నాయక్, అరుణాదేవి, ప్రశాంత్, రాములు

సంక్షిప్త సమాచారం

తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మధిరలోని దెందుకూరులో, ముదిగొండలో, ఎర్రుపాలెంలోని బనిగండ్లపాడులో, ఏన్కురులో జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత జీవితంలో స్థిరపడిన తర్వాత సరైన వయసులో వివాహం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుసూదన్ రావు, పీహెచ్‌ఎన్ రాణి, సూపర్‌వైజర్ లత, పద్మావతి, వైద్యాధికారులు కార్తీక్, రంజిత్, అశ్విన్, లక్ష్మి, లోహిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

వైరారూరల్: మండలంలోని పాలడుగు, గొల్లెనపాడు గ్రామాల్లోని చైల్డ్‌కేర్ సెంటర్‌లో ఉన్న సుమారు 147మంది నిరుపేద విద్యార్థులకు ఖమ్మం గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అందించిన విద్య సామగ్రిని శుక్రవారం వైరా ఎస్సై పుష్పాల రామారావు, పాలడుగు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వై.ఇమ్మానియేలు అందజేశారు. అలాగే గర్భిణులకు ఉచిత ఆటో సర్వీస్ చేస్తున్న కేజీ సిరిపురం గ్రామానికి చెందిన షేక్.లతీఫ్.. నారపునేని యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమాల్లో మోదుగు వినోద్‌కుమార్, రోజమ్మ, మురళీకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ఉమా పార్వతి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

తల్లాడ/చింతకాని: వృద్ధులు, వితంతులు, దివ్యాంగుల ఆసరా పింఛన్లు పెంచాలని ఈ నెల 13న ఖమ్మంలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి రవీందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గొల్లమందల ముత్తారావు కోరారు. శుక్రవారం తల్లాడలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎక్కిరాల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముత్తారావు మాట్లాడారు. అదే విధంగా చింతకాని మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల సమావేశంలో రవీందర్ మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఉపేందర్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో లబ్ధిదారులకు శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన దుగ్యాల విజయనిర్మల, షేక్ ఫాతీమాబీ, ఓరు సామ్రాజ్యం లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.80,500 విలువైన చెక్కులను అందించినట్లు తెలిపారు.

కారేపల్లిలో..

కారేపల్లి: విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన తాతా కృష్ణవేణి అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరింది. ఆస్పత్రి బిల్లులతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు వైరా ఎమ్మెల్యే ద్వారా దరఖాస్తు చేసుకోగా, సీఎంరిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆమెకు చెక్కును అందజేశారు.

గ్రీష్మకు నివాళి

మధిర: మధిర పట్టణానికి చెందిన టింబర్ డిపో వ్యాపారి జంగాల వెంకటరావు కుమార్తె గ్రీష్మకు శుక్రవారం జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం నివాళులర్పించారు. హైదరాబాదులోని ఇంజనీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్న గ్రీష్మ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందింది. శుక్రవారం మధిర పట్టణంలోని వెంకటరావు నివాసంలో దశదినకర్మ నిర్వహించగా, వారు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, భాస్కర్ రెడ్డి, నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరెడ్డి, చిన్న రామారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఫేర్‌వెల్‌డే వేడుకలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రెండో సంవత్సరం ఎంబీఏ విద్యార్థులకు మొదటి సంవత్సరం ఎంబీఏ విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల పూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డీఎస్‌వీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.